## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో ధనుర్మాస తిరుప్పావడ సేవ


32 కేజీల పులిహోర, డ్రై ఫ్రూట్స్‌తో వేకంటేశ్వరస్వామి

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం తిరుప్పావడ సేవ నిర్వహించారు. 32 కేజీల పులిహోర, డ్రైఫ్రూట్స్, పిండి వంటకాలు, పూలతో వెంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు ప్రత్తి ముత్తుకుమరన్ దంపతులు పాల్గొన్నారు.

### కరణం బలరాంను కలిసిన నాయకులు


బలరామకృష్ణమూర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

చీరాల: చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిని శనివారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందించిన వైఎస్సార్ సీపీ నాయకులు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

### పేద విద్యార్థికి ఆర్థిక సాయం


శైలజకు నగదు అందజేస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు (చినగంజాం): పేద విద్యార్థినికి దాతలు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని నాగులపాలెం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని మూకిరి శైలజకు శనివారం రోటరీ క్లబ్ సభ్యుడు పాబోలు వెంకటేశ్వర్లు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పాబోలు వెంకటేశ్వర్లు, నాగబైరు శ్రీనివాసరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు,కోట శ్రీనివాసరావు, శైలజ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### తల్లీకూతురు అదృశ్యం


అదృశ్యమైన తల్లీకూతురు

వేటపాలెం: తల్లీకూతురు అదృశ్యమైన ఘటనపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. మండల పరిధిలోని అక్కాయిపాలెం పంచాయతీకి చెందిన సలగల స్మైలీ, తన రెండేళ్ల కుమార్తె నిత్యప్రియతో కలిసి డిసెంబర్ 31వ తేదీన చర్చికి వెళ్లింది. అయితే చర్చి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

### రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు

చినగంజాం: గ్రామ రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మండలంలోని చింతగుంపల గ్రామంలో శనివారం నిర్వహించిన సదస్సులో మొత్తం 15 అర్జీలందినట్లు తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు తెలిపారు. భూమి సర్వే కోసం 1, పట్టాదారు పాసు పుస్తకం కోసం 3, పేరు సవరణ కోసం 5, కుల ధ్రువీకరణ కోసం 4, ఆదాయ ధ్రువీకరణ కోసం 1, ఆర్థికంగా వెనుక బడిన సర్టిఫికెట్ కోసం 1 అర్జీ అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు నాగరాజు, నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### 6న మార్టూరులో జాబ్ మేళా

మార్టూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం, సీడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 6వ తేదీ ఉదయం మార్టూరులో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. ప్రణయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేళాకు ఐసీఐసీఐ బ్యాంక్, టాటా క్యాపిటల్, ఎస్ఎస్ ఇన్వెస్టుమెంట్స్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీలు హాజరవుతాయని 100కు పైగా ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతను బట్టి వేతనం రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఏదైనా డిగ్రీ, బీఎస్సీ సైన్స్ గ్రూపుల వారు 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. బయోడేటా, ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఈ జాబ్ మేళా హర్షిణి డిగ్రీ కాలేజీలో నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు 79896 97996 సెల్ నంబర్‌లో సంప్రదించవచ్చని, అభ్యర్థులు వారి ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ గల సెల్ మాత్రమే తీసుకురావాలని ప్రకటనలో ఆయన సూచించారు.

# పీఎంశ్రీ నిధులు వాడేనా.. అటకెక్కేనా ?

- కేంద్ర ప్రభుత్వ నిధులతో పీఎంశ్రీ అమలు
- 2025–26కుగాను నియోజకవర్గంలో ఐదు పాఠశాలల ఎంపిక
- గత ప్రభుత్వంలో నాడు–నేడుతో ఐదేళ్ల పాటు స్వర్ణయుగం
- నాడు–నేడు స్ఫూర్తితో కేంద్రం ప్రభుత్వ పథకం
- ఈ నిధులను కూటమి వాడుకునేనా ?


నాడు–నేడు నిధులతో ఈపురుపాలెం జెడ్పీహెచ్ఎస్ గరల్స్ (ఫైల్)

వేటపాలెం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు స్వర్ణయుగాన్ని చూశాయి. ఆ ఐదేళ్లు ఏ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని చూసినా కార్పొరేట్ పాఠశాలల విద్యార్థికి సమానంగా ముందుకు దూసుకెళ్లాడు. షూ, బెల్ట్, టై, చక్కని యూనిఫాం, బ్యాగులతో విద్యార్థులు ఆణిముత్యాల్లా కనిపించారు. కాని అకస్మాత్తుగా కూటమి ప్రభుత్వం రావడంతో కాలం మొత్తం వెనక్కివెళ్లిపోయింది. మళ్లీ పాతరోజులు వచ్చాయి. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలను చదువుకోకూండా విద్యా వ్యవస్థను సర్వనాశనం చేసింది. తల్లికి వందనం పేరుతో ఎంతమంది ఉంటే అంతమందికి రూ.18 వేలు అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం పత్తా లేకుండా పోయింది.

### ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ)..

నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. విద్యారంగంలో నాడు–నేడు పేరుతో పాఠశాలలు రూపురేఖలు మార్చి వేసి కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం పాఠశాలలను నిలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ మార్పును గమనించిన కేంద్ర ప్రభుత్వం విద్యా వికాసంతోనే దేశ ప్రగతి సాధ్యమని ఆ విషయాన్ని గుర్తించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లోని విద్యా సంస్థల అభివృద్ధికి ఇతోధికంగా ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) అనే పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యారంగంలో సమూల మార్పుల తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను ఇస్తుంది. మిగతాది రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ఈసాయం ఐదేళ్లపాటూ అందుతుంది.

#### గతంలో నాడు–నేడుతో మారిన రూపురేఖలు..

గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని ప్రభుత్వం పాఠశాలల రూపరేఖలు నాడు–నేడు పథకం ద్వారా సమూలంగా మారిపోయాయి. అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా సంస్థల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. పేదింటి బిడ్డలకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంలో పాఠశాలలను తీర్చి దిద్దడమే కాకుండా అనేక సదుపాయాలు కల్పించారు. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అత్యాధునిక హంగులు డిజిటలైజేషన్ దిశగా చర్యలు చేపడతారు. పీఎంశ్రీకు ఎంపికైన పాఠశాలలకు మొదటి విడత నిధులు ఇప్పటికే మంజూరయ్యాయి.

#### పీఎంశ్రీని కూటమి వాడుకుంటుందా.. వదిలేస్తుందా ?

మామూలుగా కూటమి ప్రభుత్వానికి పేదలన్నా, మధ్య తరగతి కుటుంబాలన్నా చిన్నచూపు. అందుకే ప్రభుత్వ పాఠశాలలను, ఆసుపత్రులకు పట్టించుకోకుండా గాలికొదిలేసింది. ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, బై జూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, టోఫెల్ శిక్షణ తదితర కార్యక్రమాలను రద్దు చేసింది కూటమి ప్రభుత్వం. తాజాగా కొందరు మాజీ ప్రభుత్వ అధికారులు సైతం ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ 8 నెలల కాలంలో సూపర్ సిక్స్ పథకాలను ఏ ఒక్కటి అమలు చేయలేదు. కేవలం ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు, కక్ష రాజకీయాలు చేసుకుంటూ రాష్ట్రంలో శాంతి, భద్రతలు లేకుండా పాలిస్తోంది. ఇక ప్రభుత్వ పాఠశాలలను కేంద్ర ప్రభుత్వ నిధులతో పట్టించుకుంటుందా అంటే సందేహం వేయక మానదు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో డ్రాపవుట్స్ పెరిగాయని సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### చీరాల నియోజకవర్గంలో..

ఈ పథకం అమలుకు నిర్దేశించన 46 అంశాల ఆధారంగా చీరాల నియోజకవర్గ పరిధిలో రెండు మండలాలు, ఒక మున్సిపాలిటీలో ఐదు పాఠశాలలను గుర్తించి గతేడాది నవంబర్‌లో విద్యాశాఖాధికారులు ప్రతిపాదనలు పంపారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్కూల్స్ 60 శాతం మార్కులు, పట్టణ ప్రాంతాల్లోని 70 శాతం మార్కులు సాధిస్తే వాటిని పీఎంశ్రీ పథకం లబ్ధి కోసం ఎంపిక చేస్తారు. అయితే నియోజవర్గ పరిధిలో ఐదు పాఠశాలను ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపారు. మొదటి విడతలో చీరాల మున్సిపాలిటీ పరిధిలో ఎన్ఆర్‌పీఎం హైస్కూల్, చీరాల రూరల్ మండల పరిధిలోని ఈపురుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్, వేటపాలెం మండలం పరిధిలోని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ని ఈ పథకం కింద ఎంపిక చేశారు.

### మౌలిక వసతుల పెంపు..

ఈ పథకం కింద పాఠశాల్లో విద్యాబోధన సదుపాయాల్లో నాణ్యత ప్రమాణాల పెంపు, తరగతి గదుల నిర్మాణం, ఇతర వసతులు కల్పన, ఆధునిక సాకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రి సమకూర్చనున్నారు. కెమిస్ట్రీ ల్యాబ్, కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టర్, మరుగుదొడ్ల నిర్మాణం, దివ్యాంగులకు ర్యాంపులు, క్రీడా మైదానాలు, ఇతర అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు.


నాడు–నేడు కింద కొత్తపేట పాఠశాలలో అభివృద్ధి చేసిన టాయిలెట్లు (ఫైల్)

**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మేలు..**



పీఎంశ్రీ పథకం ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి దోహదపడుతుంది. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు దశల వారీగా నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తాయి. పర్యవేక్షణ అంతా ఎంఈవోలదే. డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలతో పాటు ఉపాధ్యాయులకు శిక్షణ, ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తారు.

– పురుషోత్తం, ఎంఈఓ, వేటపాలెం


నాడు–నేడు కింద అభివృద్ధి చేసిన పందిళ్లపల్లి హైస్కూల్ (ఫైల్)


నాడు–నేడు కింద అభివృద్ధి చేసిన చీరాల మున్సిపల్ హైస్కూల్‌లో టాయిలెట్లు (ఫైల్)


వేటపాలెం మండలంలోని కొత్తపేట జెడ్పీహెచ్ఎస్ (ఫైల్)

# అంధులకు ప్రపంచాన్ని చూపించిన బ్రెయిలీ


మేదరమెట్ల భవిత సెంటర్‌లో లూయిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవోలు


మేదరమెట్ల జెడ్పీహెచ్ఎస్‌లో లూయిస్ గురించి మాట్లాడుతున్న అతిథులు


చినగంజాంలోని ఆశ్రమంలో అంధులకు దుప్పట్లు అందజేస్తున్న దాతలు

కారంచేడు: అంధులకు ప్రపంచాన్ని చూపించిన ఘనత లూయి బ్రెయిలీ అని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రెయిలీ జయంతి సందర్భంగ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మండలంలోని కుంకలమర్రు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం పావులూరి శ్రీనివాసరావు విద్యార్థులకు బ్రెయిలీ జీవిత చరిత్ర వివరించారు. బ్రెయిలీ 215వ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ 1809 జనవరి 4న ఫ్రాన్స్‌లో జన్మించారన్నారు. చిన్నతనంలోనే కంటి చూపును దూరం చేసుకున్నప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని చెదిరిపోనివ్వలేదన్నారు. ఆయన పట్టుదలతో 17వ ఏటనే మంచి చదువు చదివి ప్రొఫెసర్ అయ్యారన్నారు. ఈయన ఆరు చుక్కలతో బ్రెయిలీ లిపిని తయారు చేశారని దానితోనే చేసిన లిపి నేడు ప్రపంచ దేశాలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మేదరమెట్లలో..**

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక భవిత సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో పున్నయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో బ్రెయిలీ జన్మదిన వేడుకలు నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో హెచ్ఎం అంజయ్య, కొండయ్య, రవిశేఖర్, పద్మావతి, రాధాశ్రీష, వీ.సుబ్రహ్మణ్యం, కే.పోతురాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**దుప్పట్లు పంపిణీ**

చినగంజాం: బ్రెయిలీ లిపి సృష్టి కర్త లూయిస్ బ్రెయిలీ జయంతిని మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాల్మీకి వృద్ధుల ఆశ్రమంలో భారత్ నిర్మాణ్ వలంటీర్ గోవింద స్వామి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల దివ్యాంగుల సమాఖ్య సభ్యుడు కందేపి సురేష్ లూయిస్ బ్రెయిలీ సేవల గురించి తెలియజేశారు. అనంతరం ఆశ్రమంలో అంధులకు దుప్పట్లు అందజేశారు.

# మార్టూరులో దొంగల హల్‌చల్


సీసీ కెమెరాలో రికార్డయిన నిందితుడు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో దొంగలు హల్‌చల్ చేశారు. మండల కేంద్రం మార్టూరులో శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు దొంగలు నాగరాజుపల్లి రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్‌తో పాటు దాని ఎదురుగా గల మరో ఇంట్లో చోరీ యత్నం చేశారు. స్టేషన్ రైటర్ సాయి వివరాల మేరకు.. నాగరాజుపల్లి రోడ్డులోని మల్లికార్జున రెసిడెన్సి అపార్ట్‌మెంట్ ఎదురుగా దండా సుజాత, నాగేశ్వరరావు దంపతుల ఇల్లు ఉంది. వీరు ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రంలో వ్యవసాయం చేస్తూ అక్కడే ఉంటున్నారు. వీరు తమ నివాసం ముందు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను తమ సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేసుకొని ప్రతిరోజు గమనిస్తూ ఉంటారు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి మూడు గంటల ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేయనట్లు గమనించారు. వెంటనే సుజాత మండలంలోని డేగరమూడి గ్రామంలో నివసించే తమ సోదరుడు నాగుబడి శ్రీనివాసరావును అప్రమత్తం చేసి తమ ఇంటికి వెళ్లమని చెప్పింది. శ్రీనివాసరావు వెంటనే మార్టూరుకు వచ్చి చూడగా సీసీ కెమెరాల వైర్లు కత్తిరించి ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఇంటి లోపల పరిశీలించగా ఇంట్లో ఉన్న లాకర్‌తో పాటు కప్ బోర్డును ధ్వంసం చేసి వాటిలోని బట్టలు, రోల్డ్ గోల్డ్ నగలను చిందర వందరగా పడవేసి నిందితులు వెళ్లిపోయినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులు అపార్ట్‌మెంట్ పరిసరాలకు వెళ్లి పరిశీలించారు. వాచ్‌మెన్ రూముకు బయట నుంచి గడియపెట్టి ఉండటం గమనించి తలుపు తీసి అతనిని బయటకు విడిపించారు. అనంతరం అపార్ట్‌మెంట్ గల 8 సీసీ కెమెరాలలో నాలుగు ధ్వంసం చేయగా, మిగిలిన కెమెరాలలో నిందితులు మొదట ఈ అపార్ట్‌మెంట్‌లో చోరీ కోసం విఫల యత్నం చేసినట్లు గుర్తించారు. అపార్ట్‌మెంట్ చోరీకి ఎలాంటి అవకాశం లేకపోవడంతో ఇక్కడ నుంచి ఎదురుగా గల సుజాత, నాగేశ్వరావు దంపతుల నివాసానికి నడిచి వెళ్లినట్లుగా సీసీ కెమెరాలు ద్వారా పోలీసులు గుర్తించారు. సుజాత సోదరుడు నాగుబడి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజనం


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య


బల్లికురవ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని భవనం అంజిరెడ్డి, తులాబందుల అర్జునయ్య ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధికారులు శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్ శేషుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం సత్యనారాయణ,వైఆర్ హైస్కూల్ హెచ్ఎం ఈదర రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

**చీరాలలో..**

చీరాల: ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో డొక్కా సీతమ్మ భోజన పథకాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం ఆయన విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏపీ హ్యాండ్లూమ్స్ చైర్మన్ సజ్జా హేమలత, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, పి.రవికుమార్, ప్రిన్సిపాల్, మండల విద్యాశాఖ అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బల్లికురవ: గ్రామీణ ప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ఓ వరమని బల్లికురవ ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అన్నారు. శనివారం బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె సుధాకర్, ఎంఈవో 2 రమేష్‌బాబు, ఉన్నత పాఠశాల హెచ్ఎం హనుమంతరావు, ఎంవీ ఫౌండేషన్ కోర్డినేటర్ పీ. హరిహరరెడ్డి పాల్గొన్నారు.

# మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత


మెటీరియల్ పంపిణీ చేస్తున్న క్లబ్ అధ్యక్షుడు వీరయ్య

అద్దంకి రూరల్: పదో తరగతి పరీక్షలో మంచి మార్కులు సాధించటానికి టెస్ట్ పేపర్లు ఉపయోగపడతాయని అతిథులు పేర్కొన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో రోటరీ పూర్వ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు మనవరాలు సాత్విక పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని పదోతరగతి విద్యార్థినులకు మోడల్ టెస్ట్ పేపర్లు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలో మంచి మార్కులు సాధించడానికి టెస్ట్ పేపర్లు బుక్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ఎజీ మహమ్మద్ రఫీ, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఆంజనేయులు, ప్రిన్సిపాల్ దుర్గా గాయిత్రి, న్యాయవాది గృహలక్ష్మీ, పాల్గొన్నారు.

# వ్యర్థాలను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


పర్చూరు–చీరాల రోడ్డులో పొక్లెయిన్‌తో వ్యర్థాలను తొలగిస్తున్న అధికారులు

పర్చూరు (చినగంజాం): రహదారిపై వ్యర్థాల దహనంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్న కథనంతో అధికారులు ఎట్టకేలకు స్పందించారు. శనివారం సాక్షి దినపత్రికలో 'అమ్మో పొగ.. ఆపై మంచు' అనే కథనాన్ని ప్రచురించింది. స్పందించిన అధికారులు స్వయంగా ఘటనా స్థలానికి చేరుకొని పర్చూరు, ఉప్పుటూరు, నాగులపాలెం పంచాయతీ సిబ్బంది సాయంతో జేసీబీతో రహదారి పక్కన వ్యర్థాలను తొలగించారు. రహదారి పక్కన చెత్త ఏరుకొనే వారు తగుల బెట్టినందున పొగ ఏర్పడిందని, ఇటువంటవి తిరిగి జరుగకుండా చర్యలు తీసుకోవాలని పర్చూరు, నాగులపాలెం, ఉప్పుటూరు పంచాయతీలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్ తెలిపారు. దాంతో పాటుగా దుకాణ యజమానులు, టీ స్టాల్స్ నిర్వాహకులు, హోటళ్ల యజమానులు, కొబ్బరి బొండాల వ్యాపారులకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కే సత్యనారాయణ, కార్యదర్శులు మస్తాన్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

### పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ


కుట్టు మిషన్లు అందిస్తున్న క్లబ్ సభ్యులు

చీరాల అర్బన్: పేదమహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ బంజారాహిల్స్, బీజీఆర్ మైన్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంయుక్త సహకారంతో కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం స్థానిక నవాబ్‌పేటలోని ప్రతాప్ ఇండస్ట్రీస్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది బండారుపల్లి హేమంత్ కుమార్ మాట్లాడుతూ అట్టడుగున ఉన్న పేద మహిళలకు కుట్టుమిషన్‌లు ఉచితంగా ఇవ్వడం ద్వారా వారి కుటుంబాలకు అండగా నిలబడతారన్నారు. అనంతరం పది మంది మహిళలకు కుట్టుమిషన్లు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ క్షీరపురి అధ్యక్షుడు బాచిన నాగమల్లేశ్వరరావు, క్లబ్ కార్యదర్శి ముప్పల వంశీకృష్ణ, కోశాధికారి డాక్టర్ బి.రవితేజ, క్లబ్ సభ్యులు మల్లికాఖార్జున, ఆర్‌వి రమణ, రామకృష్ణ, రమణరావు తదితరులు పాల్గొన్నారు.